

# జీవన సౌరభం



హిందీ మూలం: నందకిశోర్ మిశ్ర

తెలుగు అనువాదం: కొమ్మిశెట్టి మోహన్



అనువాదకథ

## ప్రయత్నం

### రాజు శయ్యపై పవళించి ఆలోచనల్లో లీనమై వున్నాడు. శత్రురాజుతో ఆయనకిది ఎనిమిదవ ఓటమి.

**ఆయన తన అదృష్టానికి నిందించుకోసాగాడు. ఆయనచుట్టూ నిరాశయనే గాఢాంధకారమలుముకుంది.**

*తాను అదృష్టచక్ర పరిహాసానికి బలి అయ్యాయని భావించి, ఇక యుద్ధం చేయరాదనే నిర్ణయానికి రావాలనే ఆలోచనలో వున్నాడు. ఇంతలో రాజుగారి దృష్టి అకస్మాత్తుగా పైకప్పువైపు మరలింది. అక్కడొక సాలెగూడు వుంది. ఒక సాలీడు అందులో ప్రవేశించడానికి ముందుకు సాగుతోంది.*

ప్రవేశద్వారం లోపలికి ప్రవేశించేంతలో చూస్తూ వుండగానే అది కింద పడిపోయింది. పడబోతూ అది తన్ను తాను సంబాళించుకుంది. రెండోసారి సాలెగూటివైపు నడిచింది. కానీ ఈసారి కూడ అది జారి కింద పడింది. సాలీడు ప్రయత్నిస్తూనే వుంది. మూడవసారి, నాలుగవసారి, ఐదవసారి, ఆరవసారి కూడ అది సాలెగూటిలోకి ప్రవేశించేందుకు విఫలయత్నం చేసింది. రాజులో ఉత్సుకత పెరిగింది. ఆయన సాలీడు సంఘర్షణని అర్థం చేసుకున్నాడు. సాలీడు మళ్ళీ తన్ను తాను సంబాళించుకుంది, నియంత్రించుకుంది. కాని దురదృష్టం! అది ఏడవసారి, ఎనిమిదవసారి కూడ విజయం సాధించలేదు. అది ఒకచోట ఆగింది. ఇక ఖచ్చితంగా సాలీడు ప్రయత్నించే విషయమే ఆలోచించదు. దాని అదృష్టం అంతే! అని రాజు అనుకున్నాడు. ఇక రాజు తన దృష్టి మరోవైపు మళ్ళించే ప్రయత్నంలో వున్నాడు. ఇంతలో అకస్మాత్తుగా సాలీడు మళ్ళీ ధైర్యం కూడదీసుకుని సాలెగూడు వైపు సాగడం ఆయన చూశాడు. రాజుకు దానిలో నవచైతన్యం ఊపందుకున్నట్లనిపించింది. అది ఆత్రుతగా ముందుకు, ఇంకా ముందుకు సాగిపోతోంది. ఈసారి ప్రయత్న ఫలితం కూడ ఇంతకుముందు ఎనిమిది ప్రయత్నాలకంటె భిన్నంగా వుండదని రాజు భావించాడు. ఆ ఆలోచన రాగానే రాజు చింతించాడు.

మరోవైపు సాలీడు ముందుకు సాగిపోతోంది. అది ఇప్పుడో, అప్పుడో సాలెగూటిలోకి అడుగిడుతుందన్నట్లుంది. రాజు ఆ దృశ్యాన్ని అలాగే చూస్తూ వుండిపోయాడు. గంటలు క్షణాల్లా

గడచిపోయాయి. సాలీడు సాలెగూటిలోకి ప్రవేశించి తన విజయానికి పొంగిపోయే తరుణం రానే వచ్చింది.


రాజుకు మొదట నమ్మకం కుదరలేదు. కాని తుదకు తొమ్మిదవ సారి అది తన యాత్రలో విజయం సాధించడం ఆయన చూశాడు. అప్పుడు రాజు మనస్సులో సంఘర్షణ ఆరంభమైంది. ఆయన నిరాశ నుంచి తేరుకుని మళ్ళీ శత్రుసైన్యం పైకి దండెత్తాలని నిశ్చయించుకున్నాడు. ఆయన దృఢమైన సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. ధైర్యాన్నీ, దృఢ సంకల్పాన్నీ కూడదీసుకుని శత్రువు పైకి దండెత్తాడు. ఆయన యాత్ర విఫలం కాలేదు. శత్రువు పరాజితుడై వెనుదిరిగాడు.

ఉత్సాహం ఉరకలు వేస్తూ వుంటే, వరుస పరాజయాలు మనో బలాన్ని దిగజార్చకుంటే, అలుపెరుగని ప్రయత్నం తుదకు విజయశ్రీని వరింపజేస్తుంది.

** *** **

# న్యాయం

ప్రాచీనకాలంనాటి కథ. ఒక రాజుండేవాడు. ఆయన ప్రజావత్సలుడు, న్యాయప్రియుడు. ఆయన సత్యమార్గాన్నీ, న్యాయమార్గాన్నీ అనుసరించేవాడు. రాజుగారి నగరంలో అప్పుడప్పుడు ఒక పెద్ద సంత జరిగేది. సంత ముగిసేటప్పటికి అమ్ముడు బోకుండా మిగిలిపోయిన వస్తువుల్ని తానే కొంటానని రాజు ప్రకటించాడు. దుకాణదారులు రాజుగారి పట్ల ప్రసన్నులుగా వుండేవారు.



ఒకరోజు సంత ముగిసే సమయం కావస్తోంది. ఆరోజు వస్తువులన్నీ ప్రజలు కొన్నారు. ఒక్క శని విగ్రహం మాత్రం అమ్ముడు బోకుండా మిగిలిపోయింది. సంచరిస్తూ రాజు అచటికి వచ్చాడు. తన ప్రకటన ప్రకారం ఆయన శని విగ్రహం తీసుకొన్నాడు. ఆయన మనుషులు దాని మూల్యం చెల్లించారు. ఇప్పుడు శని విగ్రహం రాజమహలుకు వచ్చింది. ఆరోజు రాత్రి రాజు నిద్రలో వున్నాడు. తెల్లని వస్త్రాల్లో ఒక భద్రమహిళ రాజమహలులోంచి బయటికి వెళుతుండడం రాజు చూశాడు. రాజు లేచి కూర్చున్నాడు. ఆయన ఆమెను అనుసరించాడు. ఆమె రాజద్వారం నుంచి బయటికి అడుగు వేయబోతుండగా రాజు ఆమెను గురించి అడిగాడు. "తాను సరస్వతి ననీ, రాజు శని విగ్రహాన్ని వుంచుకున్నందున తాను బయటకు వెళుతున్నాననీ" ఆ మహిళ చెప్పింది. శని నివాసమున్నచోట బుద్ధి, విద్యలకు చోటు లేదని ఆమె చెప్పింది. ఆమె జవాబు విని రాజు తిరిగి వచ్చాడు. సరస్వతి మహలులోంచి బయటికి వెళ్ళిపోయింది.

తిరిగొచ్చి రాజు మళ్ళీ పడుకోబోయాడు. ఇంతలోనే అమూల్య ఆభరణాలంకృతయై, దివ్య వస్త్రధారిణియై ఒక మహిళ మహలులోంచి ద్వారం వైపు వెళ్ళడం ఆయన చూశాడు. రాజు ఆ మహిళను అనుసరించాడు. రాజు ఆమెను గురించి తెలుసుకోవా లని జిజ్ఞాస చూపాడు. తాను రాజ్యలక్ష్మిననీ, రాజు శనివిగ్రహాన్ని రాజమహలులో వుంచుకున్నందున ఇక తానా మహలులో వుండడంలో ఔచిత్యం లేదనీ ఆమె చెప్పింది. రాజు మౌనంగా వుండిపోయాడు. రాజ్యలక్ష్మి మహలులోంచి బయటికి వెళ్ళిపోయింది.

రాజు ఆలోచిస్తూ తన శయ్యపై పడుకునే ప్రయత్నంలో వున్నాడు. అద్భుతమైన వస్త్రాల్లో అలంకృతుడై, తేజోవంతుడైన, ఒక భద్రపురుషుడు మహలులోంచి బయటకు వెళ్ళడానికి వేగంగా ముందుకు నడవడం ఆయన చూశాడు. రాజు లేచి నిలబడ్డాడు. ముందుకు వచ్చి ఆయన ఆ భద్ర పురుషుని సంబోధించి తనని గురించి తెలుపమన్నాడు. తాను న్యాయాన్ననీ, శనివిగ్రహం మహలులో వుంచుకున్నందున, సరస్వతి, రాజ్యలక్ష్మి ఇరువురు రాజ్యం వదిలి వెళ్ళారనీ, అలాంటి పరిస్థితిలో తాను కూడా ఇక్కడ వుండటంలో ఔచిత్యం లేదనీ ఆ భద్రపురుషుడు రాజుతో అన్నాడు. తాను రాజ మహలు వదిలి వెళ్ళడం న్యాయం కాదనీ, రాజు న్యాయదేవతని అర్థించాడు. న్యాయం, సత్యం, రక్షించడానికే తాను ప్రకటించినట్లుగా శని విగ్రహాన్ని రాజమహలుకు తెచ్చి వుంచుకున్నాననీ, అందువలన న్యాయదేవత నిర్ణయం సత్యం, న్యాయం ఆచరణనే అపహాస్యం చేసినట్లవుతుందని రాజు అభ్యర్థించాడు. రాజు మాటలను మననం చేసుకుంటూ న్యాయదేవత రాజమహలులోకి తిరిగొచ్చాడు.

న్యాయదేవత కృపవల్ల రాజు మళ్ళీ నిద్రకుపక్రమించాడు. ఆయన నిద్రిస్తూనే- సరస్వతి, ఆవె వెనుకే రాజ్యలక్ష్మి, ఇద్దరు దేవతలు తిరిగి రావడం చూశాడు. న్యాయం, సత్యం, వున్నచోట సరస్వతి, రాజ్యలక్ష్మి ఇరువురు కొలువుండి ఆనందమయమైన సుఖవంతమైన, సమృద్ధవంతమైన సామ్రాజ్యాన్ని సాక్షాత్కరింపజేస్తారన్నది అక్షరాలా నిజం.

న్యాయదేవత కృపవల్ల రాజు మళ్ళీ నిద్రకుపక్రమించాడు. ఆయన నిద్రిస్తూనే- సరస్వతి, ఆమె వెనుకే రాజ్యలక్ష్మి, ఇద్దరు దేవతలు తిరిగి రావడం చూశాడు. న్యాయం, సత్యం, వున్నచోట సరస్వతి, రాజ్యలక్ష్మి ఇరువురు కొలువుండి ఆనందమయమైన సుఖవంతమైన, సమృద్ధవంతమైన సామ్రాజ్యాన్ని సాక్షాత్కరింపజేస్తారన్నది అక్షరాలా నిజం.